క్లుప్తంగా

బాధిత కుటుంబానికి చేయూత



ఆర్థికసాయం అందజేస్తున్న సభ్యులు

లింగాపూర్: మండలకేంద్రంలోని అంబేడ్కర్ కాలనీకి చెందిన కాంబ్లే లక్ష్మీబాయి అనారోగ్యంతో మృతి చెందగా, బాధిత కుటుంబానికి రెహమాన్ ఫౌండేషన్ తరఫున రూ.5000 ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు ఆడే అనిల్‌కుమార్, జాటోత్ రాహుల్, దవీత్, సుదర్శన్, మగ్రే శంకర్, కాంబ్లే సుధాం, సిద్ధార్థ్ తదితరులు ఉన్నారు.

జర్నలిస్టు యోగిరెడ్డికి ఘన నివాళి



కొవ్వొత్తులతో నివాళులర్పిస్తున్న జర్నలిస్టులు

ఆసిఫాబాద్అర్బన్: వరంగల్ జిల్లాలో ఆత్మహత్య చేసుకున్న యువ జర్నలిస్టు యోగిరెడ్డి ఆత్మకు శాంతి కలగాలని ఆదివారం జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్‌చౌక్ వద్ద జర్నలిస్టుల సంఘాల ఆధ్వర్యంలో కొవ్వొత్తులతో నివాళులర్పించారు. ఈ సందర్భంగా యోగిరెడ్డి చిత్రపటం వద్ద సంతాపం ప్రకటించారు. నాయకులు రవినాయక్, అబ్దుల్ రహమాన్‌లు, ఎలక్ట్రానిక్, ప్రింట్ మీడియా జర్నలిస్టులు పాల్గొన్నారు.

'జాగో హిందూ' కార్యవర్గం ఎన్నిక



నూతనంగా ఎన్నికైన కార్యవర్గ సభ్యులు

ఆసిఫాబాద్అర్బన్: శ్రీరామ హిందూ పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో ఆదివారం జిల్లా కేంద్రంలోని కేస్లాపూర్ హనుమాన్ ఆలయంలో జాగో హిందూ కమిటీ కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా ఆకుల సంతోష్, కార్యదర్శులుగా రాజు, సంతోష్, హరిప్రియ, ధనలక్ష్మి, సలహాదారులుగా గుర్రాల వెంకటేశ్వర్లు, రేకల మల్లేష్, గడ్డల ప్రణయ్, అనిశెట్టి సదాశివ్, కార్యనిర్వాహక సభ్యులుగా సిద్దంశెట్టి కృపాల్, వైభవ్, చైతన్య, కార్తీక్, కోటేష్, అరుణ్, సునీల్‌లను ఎన్నుకున్నారు. అనంతరం రక్షా బంధన్‌ను పురస్కరించుకొని రాఖీలను పంపిణీ చేశారు.

హిందువులపై దాడులకు నిరసనగా ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు

కాగజ్‌నగర్‌రూరల్: బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న దాడులకు నిరసనగా ఆదివారం మండలంలోని నజ్రూల్‌నగర్‌లో బెంగాలీలు క్యాండిల్ ర్యాలీ నిర్వహించారు. గణేశ్ మందిర్ నుంచి ప్రారంభమైన ర్యాలీ మార్కెట్ మీదుగా సుభాష్‌చౌక్‌వరకు కొనసాగింది. వారు మాట్లాడుతూ రిజర్వేషన్‌లకు వ్యతిరేకంగా విద్యార్థులకు చేసిన ఆందోళనలు పక్కదారి పట్టించి హిందువులనే లక్ష్యంగా చేసుకుని వందలాది మంది హిందువులను హతమార్చడం దారుణమన్నారు. బెంగాలీ హిందువులపై మారణహోమాన్ని ఆపాలని డిమాండ్ చేశారు.

లంబాడితండాలో కమ్యూనిటీ పోలీసింగ్



అవగాహన కల్పిస్తున్న సీఐ శశిధర్‌రెడ్డి

కాసిపేట: మండలంలోని దేవాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని లంబాడితండాలో ఆదివారం పోలీసులు కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాం నిర్వహించారు. మందమర్రి సీఐ శశిధర్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో మత్తు పదార్థాలు, గంజాయి, మద్యపానం, సైబర్ నేరాలు, ట్రాఫిక్ నియమాల ఉల్లంఘన, 100డయల్, స్త్రీలపై జరిగే దాడులు పలు అంశాలపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా గ్రామంలో వాహనాల పత్రాలు సక్రమంగా లేని 35మోటారుసైకిళ్లు, 4లీటర్ల గుడుంబా సీజ్ చేసి ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. గ్రామంలో ఎటువంటి అసాంఘిక కార్యకలాపాలు జరిగినా, అనుమానం వచ్చినా పోలీసులకు సమాచారం ఇవ్వాల్సిందిగా కోరారు. కార్యక్రమంలో దేవాపూర్ ఎస్సై ఆంజనేయులు, పోలీసులు పాల్గొన్నారు.

వేతనాల కోసం ఆందోళన



అలంకారప్రాయంగా మారిన పెట్రోల్, డీజిల్ పోసే యంత్రాలు

- ఆరు రోజులుగా కార్మికుల నిరసన
- మూసి ఉన్న పెట్రోల్ బంక్‌లు
- పట్టించుకోని అధికారులు

కెరమెరి: ఐటీడీఏ, జీసీసీ ఆధ్వర్యంలో సంయుక్తంగా నాలుగేళ్లక్రితం ప్రారంభించిన పెట్రోల్ బంక్‌లకు చెందిన కార్మికులు ఆందోళనలు చేపట్టారు. దీంతో గత మంగళవారం నుంచి వినియోగదారులకు నాణ్యమైన ఇంధనం లభించడం లేదు. నాలుగేళ్ల క్రితం ఇచ్చిన వేతనాలనే ఇప్పటికీ అందజేస్తున్నారని, వెంటనే వేతనాలు పెంచాలని బంక్‌లో పని చేసే కార్మికులు నిరసనలు చేపట్టారు. రోజూ దినచర్యల్లో భాగంగా పెట్రోల్ బంక్‌లకు హాజరువుతున్నప్పటికీ వినియోగదారులకు పెట్రోల్ పోయడం లేదు.

ఒక్కో బంకులో 8 మంది కార్మికులు..

జిల్లాలోని కెరమెరి, జైనూర్, తిర్యాణి, నార్నూర్, కాగజ్‌నగర్ మండలాలతో పాటు ఆదిలాబాద్ జిల్లాలోని ఇంద్రవెల్లి, ఇచ్చోడ, నిర్మల్ తదితర ప్రాంతాల్లో ఐటీడీఏ, జీసీసీ ఆధ్వర్యంలో పెట్రోల్, డీజిల్ బంక్‌లు పని చేస్తున్నాయి. ఒక్కో బంకులో ఎనిమిది మంది కార్మికులు విధులు నిర్వహిస్తున్నారు. ఈ బంక్‌లు 24 గంటలపాటు పని చేస్తున్నాయి. ఒక్కో బంక్‌లో రోజూ సుమారు రూ.2 లక్షలకు తగ్గకుండా ఆదాయం వస్తుంది. ఇక సీజన్‌లో ఆదాయం పెరిగి ఒక్కో మండలంలో రూ.4 లక్షల నుంచి రూ.5 లక్షల వరకు ఆదాయం వస్తుంది. ప్రభుత్వ పెట్రోల్ బంక్‌లు కావడంతో ఈ బంకులపై వినియోగదారులకు అపారమైన విశ్వాసం ఉంది. ఇక్కడ ఇంధనం కల్తీ కాదని, ధరలో, నాణ్యతలో ఎలాంటి అవకతవకలు జరగవనే ఉద్దేశంతో వినియోగదారులు తమ వాహనాలకు ఈ బంకుల నుంచే పెట్రోల్, డీజిల్‌ను వినియోగిస్తున్నారు. కానీ గత ఆరు రోజులుగా బంక్‌లు పనిచేయక పోవడంతో ఇతర బంక్‌లు లేని చోట గతిలేని పరిస్థితుల్లో ప్రైవేటు వ్యాపారస్తుల వద్ద నుంచి ఇంధనం పోయించుకుంటున్నారు.

వేతనాలు పెంచాలని డిమాండ్..

ప్రస్తుతం ఒక్కో కార్మికునికి నెలకు రూ. 8500 వేతనం అందిస్తున్నారు. గడిచిన ఏడాది నుంచి వేతనం పెంచాలని డిమాండ్ చేస్తున్నప్పటికీ అధికారులు చేస్తాం.. చూస్తాం అంటూ సరిపెడుతున్నారని కార్మికులు ఆరోపిస్తున్నారు. రెండు నెలల క్రితం ఐటీడీఏ అధికారిని కలిసి సమస్యలు విన్నవించగా వారం రోజుల్లో సమస్యలు పరిష్కరిస్తానని హామీ ఇచ్చారని, కానీ ఇప్పటికీ వేతనాలు పెరగలేదన్నారు. రోజురోజుకూ పెరుగుతున్న నిత్యావసర ధరలు, కుటుంబ పోషణ దృష్టిలో పెట్టుకొని నెలకు కనీసం రూ.15వేలు వేతనం ఇవ్వాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

త్వరలో పరిష్కారం

పెట్రోల్ బంకుల్లో పని చేసే కార్మికులు వేతనాలు పెంచాలని నిరసనలు చేపట్టారు. ఈ విషయాన్ని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి దృష్టికి తీసుకెళ్లాం. లైజన్ అధికారులు, బంక్‌ల ఇన్‌చార్జీలు, కార్మికులతో మాట్లాడి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నారు. త్వరలోనే వేతనాలు పెరిగే అవకాశం ఉంది.

– బొజ్యా నాయక్, జీసీసీ మేనేజర్, ఆసిఫాబాద్

పొలం దారి.. బురదమయం



బురదమయంగా గురుడుపేట -కనికి రోడ్డు



గుండాయిపేట్‌లో పొలాలకు వెళ్లే దారి దుస్థితి

- నడవలేక నరకయాతన
- ఏళ్లుగా పరిష్కారం కాని సమస్య
- మొరం వేయాలని రైతుల విన్నపం
- పట్టించుకోని అధికారులు, పాలకులు

కౌటాల: మండలంలోని ప్రజలు ప్రధానంగా వ్యవసాయంపైనే ఆధారపడి జీవిస్తున్నారు. వ్యవసాయ క్షేత్రాలకు వెళ్లే దారులు వర్షాలకు బురదమయంగా మారడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. రోడ్లపై లోతుగా గుంతలు పడటంతో రైతులు, కూలీలు నడవడానికి నరకయాతన పడుతున్నారు. ప్రస్తుతం వరి నాట్లు, పత్తి పంటల్లో కలుపు తీయడం, ఎరువులు వేయడం వంటి పనులు చేస్తున్నారు. రోడ్లపై మొరం పోయాలని మొరపెట్టుకుంటున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యాడు.

పట్టింపులేని అధికారులు

మండలంలో 20 గ్రామపంచాయతీలు ఉండగా, వీటి పరిధిలో 35 వేల జనాభా ఉంది. మండల వ్యాప్తంగా ఉన్న 30వేల ఎకరాల్లో రైతులు పత్తి, సోయా, కంది, వరి, మిర్చి పంటలను సాగు చేస్తున్నారు. ఆయా గ్రామాల్లో పొలాలకు వెళ్లే ప్రధాన రహదారులు సుమారు వందకు పైగా ఉన్నట్లు అధికారులు ప్రాథమికంగా అంచనా వేశారు. మండలంలో ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షాలకు పొలాలకు వెళ్లే దారులు పూర్తిగా బురదమయంగా మారాయి. ప్రస్తుతం రోడ్లపై నుంచి ఎడ్లబండ్లు సైతం వెళ్లలేని పరిస్థితి నెలకొంది. దీంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ఏటా వర్షాకాలంలో వ్యవసాయ పొలాలకు వెళ్లే రోడ్లన్నీ బురదమయంగా మారుతున్నా అధికారులు పట్టించుకోడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఏటా ఇబ్బందులు

కొన్నేళ్లుగా గ్రామాల్లో వ్యవసాయ రహదారుల సమస్య వేధిస్తోంది. కనీసం ఎడ్లబండ్లు, సైకిళ్లు వెళ్లలేని పరిస్థితి ఉంది. ఎరువుల బస్తాలు, ధాన్యం తరలించాలంటే రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గతంలో ఉమ్మడి రాష్ట్రంలో దివంగత వైఎస్సార్ సీఎంగా ఉన్నప్పుడు పంట పొలాలకు వెళ్లే దారులకు నిధులు మంజూరు చేశారు. ఆ సమయంలో ప్రధాన రోడ్లకు మోక్షం లభించి బురద లేని రోడ్లుగా మార్చారు. తర్వాత రోడ్లను పట్టించుకున్న వారు లేదు. మండలంలోని గురుడుపేట -కనికి మార్గంలో, తాటిపల్లి గ్రామ శివారులో, గుండాయిపేట్ గ్రామ సమీపంలో, వీర్దండి గ్రామ శివారులో, నాగేపల్లి, తుమ్మిడిహెట్టి, పార్డీ, సాండ్‌గాం, బోదంపలి, తలోడి, ముత్తంపేట్, మొగడ్‌దగడ్ గ్రామాల్లోని రైతుల పొలాలకు వెళ్లే రోడ్లు అధ్వానంగా ఉన్నాయి. అధికారులు స్పందించి ఉపాధిహామీ పథకంలో రోడ్ల సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని, పాలకులు వెంటనే మొరం వేసి మరమ్మతులు చేయాలని మండల రైతులు కోరుతున్నారు.

ఇబ్బంది పడుతున్నాం



వ్యవసాయ పొలాలకు వెళ్లే రోడ్లు ఎడతెరిపి లేని వర్షాలకు బురదమయంగా మారాయి. రైతులు ఇంటి వద్ద కంటే ఎక్కువ సమయం పొలాల్లోనే గడుపుతుంటారు. నిత్యం బురదలో నడిస్తే కాళ్లు చెడుతున్నాయి. అధికారులకు విన్నివించినా పట్టించుకోవడం లేదు. మట్టి రోడ్లపై నుంచి కేజీవీల్స్ వెళ్లడంతో రోడ్లు అధ్వానంగా మారాయి. ఏటా వర్షాకాలంలో పరిస్థితి ఇలాగే ఉంటుంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి పొలాలకు వెళ్లే దారులకు మొరం పోయాలి.

– మడావి బాపూజీ, రైతు, వీర్దండి

కౌటాల పీహెచ్‌సీ తనిఖీ

సాక్షి ఎఫెక్ట్..



వివరాలు తెలుసుకుంటున్న అధికారులు

కౌటాల(సిర్పూర్): మండల కేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని శనివారం రాత్రి వైద్యాశాఖ అధికారులు తనిఖీ చేశారు. బుధవారం 'సాక్షి'లో ప్రచురితమైన నాడు 'మొదటి స్థానం.. నేడు రెఫరెన్స్‌కే పరిమితం' కథనానికి వైద్యశాఖ అధికారులు స్పందించారు. కౌటాల పీహెచ్‌సీని డైరెక్టర్ ఆఫ్ పబ్లిక్ హెల్త్ (డీహెచ్) రవీంద్రనాయక్ పరిశీలించారు. ఆసుపత్రిలో సిబ్బంది, సౌకర్యాలపై ఆరా తీశారు. ఇద్దరు వైద్యులు, నలుగురు స్టాఫ్‌నర్సుల పోస్టులు ఖాళీగా ఉన్నాయని వైద్య సిబ్బంది తెలిపారు. త్వరలో పూర్తిస్థాయిలో వైద్య అధికారులను నియమిస్తామని ఆయన పేర్కొన్నారు. ప్రస్తుతం సీజనల్ వ్యాధులు సోకే ప్రమాదం ఉందని, వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండి ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని. ఆయన వెంట డీఎంహెచ్‌వో తుకారాం, డిప్యూటీ డీఎంహెచ్‌వో సీతారాం, ఎస్సీడీపీవో వినయ్‌కుమార్, వైద్యులు తస్మియా, కృష్ణవేణి, సిబ్బంది ఉన్నారు.

చింతలమానెపల్లి ఎస్సైగా నరేశ్



ఎస్సైగా బాధ్యతలు స్వీకరిస్తున్న నరేశ్

చింతలమానెపల్లి: మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో ఆదివారం ఎస్సైగా ఐ.నరేశ్ బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు విధులు నిర్వహించిన కే. నరేశ్ బదిలీపై వెళ్లడంతో కుమురం భీం జిల్లా వీఆర్‌లో విధులు నిర్వహిస్తున్న ఐ. నరేశ్ ఇక్కడికి బదిలీపై వచ్చారు. ఆయన మాట్లాడుతూ మండలంలో శాంతిభద్రత పరిరక్షణే లక్ష్యంగా పని చేస్తామన్నారు. ప్రజలకు అందుబాటులో ఉండి వారి సమస్యలను పరిష్కరిస్తామని తెలిపారు.

'విజయ దండోరా' విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న రేగుంట కేశవరావు మాదిగ

రెబ్బెన: 30 ఏళ్ల మాదిగలు, ఉపకులాల కల సుప్రీం కోర్టు తీర్పులో సాకారమైందని, ఇందులో భాగంగా ఈ నెల 13న హైదరాబాద్‌లో నిర్వహించే విజయ దండోరా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ జాతీయ నాయకుడు, ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి రేగుంట కేశవ్‌రావు మాదిగ పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో ఆదివారం సాయంత్రం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. వర్గీకరణ ఉద్యమంలో ఎంతో మంది జైలుపాలు కాగా, సుమారు 50 మంది ప్రాణాలు కోల్పోయారన్నారు. ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకులు మందకృష్ణ మాదిగ ఎలాంటి ప్రలోభాలకు తలవంచకుండా పోరాడారని పేర్కొన్నారు. అన్ని మండలాల్లోని ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ, అనుబంధ సంఘాలు, ఉప కులాల ప్రజలు అధిక సంఖ్యలో హాజరై విజయోత్సవ మహాసభ, విజయ దండోరా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో నాయకులు గోగర్ల రాజేష్, కోరాల రాజేందర్, గోగర్ల రాజేష్, రొడ్డ శంకర్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

బోర్ మోటర్ చోరీ

కౌటాల: మండల కేంద్రంలోని పాత ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆవరణలోని హెల్త్ సబ్‌సెంటర్ వద్ద గల విద్యుత్ బోర్ మోటర్‌ను దొంగలు శనివారం రాత్రి ఎత్తికెళ్లినట్లు కౌటాల పంచాయతీ కార్యదర్శి సాయికృష్ణ ఆదివారం తెలిపారు. మోటర్ విలువ రూ. 30 వేలు ఉంటుందని తెలిపారు. పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు ఆయన తెలిపారు. హెల్త్ సబ్‌సెంటర్‌ను ప్రారంభించక ముందే అందులోని విద్యుత్‌మోటర్‌ను దొంగలు ఎత్తుకెళ్లడం గమనార్హం.

'దళిత అణగారిన వర్గాలకు అండగా ఉంటాం'

కోటపల్లి: దళిత అణగారిన వర్గాల ప్రజలకు అండగా ఉంటామని ఆల్‌ఇండియా యువజన సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనివాస్ అన్నారు. శెట్‌పల్లి శంకరాపూర్ గ్రామంలో ఆదివారం ఆల్ ఇండియా యువజన సంఘం సమావేశం ఏర్పాటు చేసి నూతన కమిటీని ఎన్నుకున్నారు.

వైద్యపట్టా పొందిన విద్యార్థికి సన్మానం



ప్రణమ్‌కుమార్‌ను సన్మానిస్తున్న గ్రామస్తులు

రెబ్బెన: మండలంలోని తుంగెడ గ్రామానికి చెందిన దుర్గం ప్రణమ్‌కుమార్ వైద్యవిద్యను పూర్తి చేసుకొని పట్టా పొందిన సందర్భంగా ఆదివారం గ్రామస్తులు శాలువాతో ఘనంగా సన్మానించారు. ప్రణమ్‌కుమార్ ఫిలిప్పీన్స్‌లో ఎంబీబీఎస్ పూర్తి చేశారు. గ్రామంలో ఎంబీబీఎస్ పూర్తిచేసిన మొట్టమొదటి వ్యక్తి ప్రణమ్‌కుమార్ కావడం విశేషం. ప్రణమ్‌ను ఆదర్శంగా తీసుకొని విద్యార్థులంతా ఉన్నత స్థాయికి చేరుకోవాలని కోరారు. కార్యక్రమంలో మాజీ ఉప సర్పంచ్ సాయికృష్ణ, గ్రామస్తులు తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

రాజీవ్‌నగర్‌లో వైద్యశిబిరం



ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

వాంకిడి: గర్భిణీలు తప్పకుండా ఆసుపత్రిలోనే ప్రసవం జరిగేలా జాగ్రత్త పడాలని అప్పుడే తల్లీ, బిడ్డా క్షేమంగా ఉంటారని ఆరోగ్య విస్తరణ అధికారి పెందూర్ రవిదాస్ సూచించారు. ఆదివారం మండలంలోని బంబార జీపీ పరి ధిలో గల రాజీవ్‌నగర్‌లో వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని నలు గురు గర్భిణులు, ఇద్దరు బాలింతలకు తీసుకో వాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. జ్వరంతో ఉన్న ఇద్దరి రక్తనమూనాలు సేకరించి మందులు పంపిణీ చేశారు. వర్షా కాలంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎమ్ఎల్‌హెచ్‌పీ రియాజ్, ఏఎస్ఎం గోదావరి, బ్రీడింగ్ చెక్కర్ చంద్రశేఖర్, ఆశ సాలక్క పాల్గొన్నారు.

మహంకాళి ఆలయానికి పోటెత్తిన భక్తులు



అమ్మవారి దర్శనం చేసుకుంటున్న భక్తులు

రెబ్బెన: మండలంలోని ఇందిరానగర్‌లో గల కనక దుర్గాదేవి, స్వయంభూ మహంకాళి అమ్మవారి ఆలయానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. జిల్లాలోని భక్తులతో పాటు పక్క జిల్లాల నుంచి భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. శ్రావణమాసం కావడంతో ఆలయం భక్తులతో కిటకిటలాడింది. అమ్మ వారిని దర్శించుకున్న భక్తులు పట్టు వస్త్రాలు, నైవేద్యాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకులు దేవార వినోద్ భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు.

'ఎస్సీ వర్గీకరణతో మేలు'



మాట్లాడుతున్న మొండయ్య

రెబ్బెన: ఎస్సీ వర్గీకరణ ద్వారా ఎవరి హక్కులు వారికి దక్కే అవకాశం ఉంటుందని నేతకాని మహర్ కుల సంఘం మండల అధ్యక్షుడు కోబ్రగాడే మొండయ్య అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో ఆయన మాట్లాడుతూ గత వారం సుప్రీం కోర్టు ఎస్సీవర్గీకరణకు అనుకూలంగా తీర్పు ఇవ్వడాన్ని నేతకాని మహర్ సంఘం స్వాగతిస్తోందన్నారు. రాష్ట్రంలో ఎస్సీ వర్గీకరణకు సీఎం రేవంత్ రెడ్డి సైతం అనుకూలమని ప్రకటించడం హర్షనీయమన్నారు. నేతకాని మహర్ సామాజిక వర్గానికి ప్రభుత్వం ప్రవేశపెట్టే పథకాల్లో, రాజకీయ రిజర్వేషన్లలో, సరైన గుర్తింపు దక్కకపోవటం శోచనీయమన్నారు. ఇప్పటికైనా సుప్రీంకోర్టు తీర్పును అములులోకి వస్తే నేతకాని మహర్ సామాజికవర్గ జనాభాకు అనుగుణంగా వాటా కల్పించి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో నాయకులు సోమయ్య, రవీందర్, తిరుపతి, మల్లయ్య, ఆనంద్‌రావు తదితరులు పాల్గొన్నారు.

ఫిర్యాదుదారులతో మర్యాదపూర్వకంగా మెలగాలి



రికార్డులు పరిశీలిస్తున్న సీఐ ముత్యం రమేశ్

బెజ్జూర్: పోలీస్‌స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదు దారులతో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని కౌటాల సీఐ ముత్యం రమేశ్ అన్నారు. ఇటీవల కౌటాల సీఐగా నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఆయన ఆదివారం బెజ్జూర్ పోలీస్‌స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా రికార్డులను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజాసమస్యలను వెంటనే పరిష్కరించాలని పేర్కొన్నారు. న్యాయపరంగా నడుచుకోవడంతో పాటు ఎవరి ఒత్తిళ్లకు తొలగ్గకుండా న్యాయం వైపు పోలీసులు ఉండాలని సూచించారు. ఆయన వెంట బెజ్జూర్ ఎస్సై విక్రమ్ ఉన్నారు.

గుండెపోటుతో పంచాయతీ కార్మికుడి మృతి



భీమయ్య (ఫైల్)

కాగజ్‌నగర్‌రూరల్: మండలంలోని చింతగూడ గ్రామపంచాయతీ పారిశుధ్య కార్మికుడు సుద్దాల భీమయ్య (68) ఆదివారం గుండెపోటుతో మృతి చెందారు. కుటుంబసభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. గత 15 రోజుల క్రితం భీమయ్యకు గుండెపోటు రాగా, కరీంనగర్ ఆస్పత్రిలో చికిత్స చేయించి ఇంటికి తీసుకొచ్చారు. సోమవారం మరోసారి ఆస్పత్రికి రావాలని వైద్యులు సూచించారని, అయితే ఆదివారం అకస్మాత్తుగా గుండెపోటు రావడంతో మృతి చెందాడని పేర్కొన్నారు.

మార్కెట్‌లో మడుగు..!



దహెగాం: మండల కేంద్రంలోని మార్కెట్ ఏరియాలో వర్షం నీరు నిలిచి మడుగును తలపిస్తోంది. మండల కేంద్రంలో ఆదివారం మధ్యాహ్నం ఒక్కసారిగా వర్షం కురువడంతో మార్కెట్‌లో భారీగా నీరు నిలిచింది. నీటిని తొలగించేందుకు గొట్టం పైపును ఇదివరకే ఏర్పాటు చేసినా పెద్దగా ప్రయోజనం ఉండడం లేదు. దీంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. వర్షపు నీరు వెళ్లేందుకు పెద్దపైప్‌లు ఏర్పాటు చేయాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.